# రాతి గుండెలు

'శివం'



త్రలుపులే వగిలిపోవు ధ్వనితో నిద్రాదేవి, అతని అలసిన శరీరమును చుట్టుకొనిన తన బాహువులను సడలించింది.

చింకిచాపనుండి లేచి, శరీరాన్ని వక్కసారి విరుచుకునే లోగానే...దడదడ...తిరిగి ధ్వని.

"ఎవరది? ఉదయాన్నే!" అనుకుంటూనే... ఎందుకో జలదరించిన శరీరాన్ని విదుపుకొని... వక్క అంగలో తలుపును జేరేడు అతను.

"భగవాన్!" అనుకుంటూ ముడుచుకొని పోయి... వెనక్కి రెండడుగులు వేసేడు. ఎదురుగా నిలబడివున్న నలుగురు పంజాబీ సైనికులను చూచి.

పంజాబీ సైనికులు ఆలసించక – ఇంట్లోనికి ప్రవేశించేరు. ప్రవేశిస్తూనే...అంతా ఒక్కసారిగా మాటాడసాగేరు.

"ఊ! త్వరగా బట్టలువేసుకో! చాలా దూరం పోవాలి."

"పిరికిపందలా అట్లా చూస్తావేం? వెంటనే బయల్దేరు...చొక్కా తొడుక్కొని."

"ఊ! క్విక్! క్విక్..."

ఇనుపబూట్లు...చిర్రాగ్గా...చాపకి బురదను పులుముతున్నాయ్, క్రోధారుణ నేత్రాలు గది నలుమూలలో చిందులు త్రొక్కుతున్నాయ్. 'బేయ్‌నట్సు' గాలిలో వూగుతూ...యీలలువేస్తూండగా-

విస్తుపోయిన అతను... 'కీ'లేని గడియారంలా...అట్లాగే నోటిమాటలురాక చూడసాగేడు.

కొలదిక్షణాలకు తెప్పరిల్లి...ఎంతో ప్రయత్నంతో చివరకు..."ఏమిటిదంతా? ఎవరుమీరు? నేను ఎక్కడకురావాలి?"

ఈప్రశ్న అనవసరమనీ...తనకి తెలుసు. ఎందుకో...ఏమో అడిగేడు అతను.

ఎక్కడకు తీసుకొని పోతారు?. ఆ హత్యాకాండలో తనని...వక జంతువులా పాల్గొన ప్రేరేపించడానికి తప్ప! ఏ పాపమూ ఎరుగని అమాయక ప్రజల్ని బలిగొనడానికి... నేడు తనుకూడా...కొని పోబడ వలసిన దేశా? తన ఆత్మకు విరుద్ధంగా యీ సమరంలో పాల్గొనడం...అమానుషం!. భగవాన్ ...భగవాన్. నీవే...శరణ్యం...

నడుము విరిగేట్లు తుపాకి మడమతో...సన్నటి పంజాబీ— వెనుకనుంచి...వక్కపోటు పొడిచి—

"హాహాహా! ఏం ప్రశ్న వేసేవ్? ఎక్కడికో తెలియదూ! ఎంత అమాయకుడవూ! అయితే చెబుతా...దేశం కోసం పోరాడ్డానికి! రోజూ వేలాది వేలు ప్రాణాలను అర్పిస్తూంటె...కౌగిలాలను అందుకొని కూడా పిరికి పందలా యిక్కడ దాగుకున్నావు...ఛీ ఛీ! సిగ్గు అయినా వుండవద్దూ...!"

అదిగో! అక్కడకే. ఆ స్మశాన వాటికకే వక ప్రాణి బాధపడుతూంటే చూడలేని తను, తుపాకీ ధరించి సోదర మానవుల్ని బలిగొనటమా! పొట్టకోసం యుద్ధములో చేరిన పల్లెటూరి అమాయకపు ప్రజల్ని, ముందువెనకలు చూపక ట్రిగ్గర్ లాగి, హత్యలు చేయడమా?

"క్షమించండి. ఇందులో ఏదో పొరబాటు జరిగి వుంటూంది. నేను జూటు మిల్సులో పనిచేసే నేర్పుగల పనివాణ్ణి! నేర్పుగల పనివాండ్రను యుద్ధములోనికి బలవంతముగా...తీసుకు వెళ్ళడానికి వీలులేదు అని విన్నా నేను."

ఎర్రబడ్డ నాల్గుజతల నేత్రాలు వొక్కసారిగ అతని ముఖంమీదవాలి అతన్ని వుక్కిరిబిక్కిరి చెయ్యగా అతను ముఖమును ప్రక్కకుత్రిప్పుకున్నాడు.

"అహా, అట్లాగా. నీముఖంచూస్తే, నీవు నేర్పరివాడిలాగ ఎక్కడా అగుపించడములేదు. యుద్ధమంటే ఎంతభయపడుతున్నావ్."

దేశానికి ప్రాణాలనివ్వడానికి తను భయపడటమా? దేశముకోసమ అనిచెబుతూ నరబలులను ప్రోత్సాహపరచడాన్ని తను అసహ్యించుకున్నాడు. దేశముకోసమని అమాయకులను హత్యచేయడమే తను నిరసిస్తున్నాడు. కాని దేశానికి ప్రాణాలను ధారపోయడానికి తను ఆలోచించడమా...? తన వక్కడి ప్రాణత్యాగంతో యితర హత్యాకాండ ఆగిపోతే, తను ఆనందంతో తనప్రాణాలను బలిదానము చేయనప్పుడూ సంసిద్ధుడే!

"నేను ఏనాడూ ప్రాణాలను దాచుకోన లేదు బాబూ! నేను చెప్పేదల్లా... నేను యీ హింసాకాండకు వ్యతిరేకిననీ, అహింసా వాదిననీను, యుద్ధమంటే నాకేనాడూ భయంలేదు."

"నిజంగానే? అయితేనడు. బట్టలు వేసుకో త్వరగా. నీ ధైర్యం చూస్తాం..."

"ఇందులో ఏదో పొరబాటు జరిగివుం..."

"అయితే బట్టలుకూడా వేసుకోనవన్నమాట. కానీ... ఈ చిరిగిన ధోవతితోనే వస్తావన్నమాట,,. నడు..."

బలవంతముగా అతను బయటకు నెట్టబడ్డాడు. అతని జాలిపలుకులు, ప్రార్ధనలు...అరణ్యరోదనను...పరిహాసించేయ్.

అతనిముఖాన చిరునవ్వు తాండవిస్తోంది ప్రశాంతత, ఓర్పు అవిచ్ఛిన్నంగా పరిపాలన చేస్తున్నాయి.

శూన్యంలోకి చూస్తూన్న అతనిని. అతని హస్తాలను రజ్జువుతో బంధిస్తూండగా ప్రజలు గుమిగూడసాగేరు అతనిచుట్టూ. "ఏంకేమిటి? ఏం దొంగి

శ్రీ కవల ఫిలిమ్సు
బాపూజీ
(తెలుగు)
★ Ch. నారాయణరావు ★ శ్రీరంజని (Jr)
మొదలగు సుప్రసిద్ధ తారాగణంతో...
కవి: B. T. నరసింహాచారి (ఎడిటర్ "ఢంకా") మ్యూజిక్ ; దిన్‌కర్ హనుమంతరావు
సూపర్‌విషన్ ; D. R. బరోద్కర్. అసోసియేటు : B. వరహాలరాజు, B. A.
కథ; డైరక్షన్ :
కవల ప్రకాష్
— వివరములు : —
SRI KAVALA FILMS,
Subhadrabai Mansions, General Patters Rord, Mount Road, Madras

లించేడు...? ఎక్కడ? హత్యా? "అన్న ప్రశ్నలు గాలిలో నృత్యం చేసేయి... కాస్సేపు.

ఎర్రటి పంజాబీ చేప్పేరు... అందరికే—'అతనో యుద్ధవ్యతిరేకి' అని. దానితో తిరిగి... కాస్సేపు ...'పిరికిపంద,' "చచ్చు వెధవ—ఏంరోగం?"

"మంచిపనే జరిగింది." అన్నమాటలు వినవచ్చేయి.

వెనుక వక సిపాయి, ముందొక సిపాయి, యిరుప్రక్కల యిద్దరు సిపాయిలు; బంధింపబడిన హస్తములను త్రాటితో పట్టుకొని నడుస్తూండగా... అతను...తను తనేకానట్లు...నిద్రలో వలె...నడువసాగేడు. వీరి వెనుక బడిపిల్లలు, ప్రజలు, వర్తకులు, వింతగా మాట్లాడకుంటూ చప్పట్లు చరుచుకుంటూ, సర్మలు, కేరింతాలు కొట్టుకుంటూ—ఊరేగింపులో నడిచినట్లు నడువసాగేరు.

అరఫర్లాంగు ముందుకు నడిచింది—ఊరేగింపు.

యుద్ధములో యిరువురు పుత్రులను గోల్పోయిన వక వృద్ధజనని అకస్మాత్తుగ ముందుకు వురికి. —అతనికి అడ్డుగా నిల్చి "యుద్ధములోనికి వెళ్ళడానికి నీవు సంశయిస్తున్నావ్ కదూ? ఏరి, ఎందుకు వెళ్ళకూడదు? నేను యిరువురు కుమార్లను బలి యిచ్చే యుద్ధదేవతికి...నీవెందుకు వెళ్ళకూడదూ... పిరికి పందా?" అంటూ చట్టున అతని ముఖమునీద వుమ్మింది.

సిగ్గుతో అతను వక్కసారి క్రుంగి పోయేడు. ముఖాన ఉమ్మి! తనముఖాన! న్యాయంగా. దైవభీతితో కూలిదాని ముఖాన! ఎక్కడ ఆ భగవాన్?

ఉమ్మి తెల్లగా, ముఖమునుండి నెమ్మదిగా జారుతూంది... గడ్డము వైపు.

పిల్లలు వక్కసారిగ చప్పట్లు కొట్టి, వర్తకులు, పనివాండ్రు వుద్రేకంగా ఏదో అరిచేరు. పంజాబీ సిపాయిలు నవ్వేరు.

వృద్ధజనని...తను చెప్పవలసినది చెప్పినాననీ ప్రజామోదం బడసిన పనిని చేసినాననే సంతృప్తితో ...తిరిగి గుమ్మం వద్దకు వెళ్ళి కూలబడి...తన కుమారులను గూర్చి తల్చుకొన సాగినది.

సమూహం ముందునకు. తర్లినది. ప్రజలు యింకా వుద్రేకముగా ఏదో అరుస్తూనే వున్నారు. పిల్లలు చప్పట్లు, యీలలు వేస్తూనేఉన్నారు. సిపాయిలు నవ్వుకుంటూనే వున్నారు. కులుకుతూ వక పడుచుపిల్ల అతని నెత్తిని...వక ఖాళీ బీడీ బుట్టను టోపీకి అలంకరించి సలాము పెట్టి ప్రక్కకు వత్తిగిల్లినది.

ఇంత అల్లరికీ, అవమానానికి గురి అయిన వ్యక్తి మాత్రము ముక్కుకు సూటిగా అనంతములోకి చూస్తూ...భగవాన్ని ప్రార్థించసాగేడు...! ప్రభూ నేనుకూడా రక్తాన్ని కండ్లచూడ వలసినదేనా? ఈ అంతులేని మారణ హోమములో పాల్గొన వలసినదేనా? నన్ను రక్షించవూ? కాపాడవూ?

క్రమక్రమముగా బేరక్సుదగ్గరకు రాసాగేయి. అతనిలోని ఆశలతో బాటువెంబడించే గుంపుకూడా సన్నబడ సాగినది.

బేరక్సు జేరుసరికి నలుగురు అయిదురు పిల్లలు మాత్రం మిగిలేరు. వారు కూడా బయట ఆగిపోయేరు...అతని అన్నల లాగనే!

అతను Orderly Roomలో ప్రవేశ పెట్టబడ్డాడు... వెంటనే.

"నీ పేరు?" అధికార మత్తతతో కూడా అజ్ఞాపూరితస్వరం.

"స........" హీనస్వరం.

"వయస్సు..?"

"నివాస స్థలం..."

"దవడమీద. గుండెల ప్రక్క రెండుపుట్టు మచ్చలు... ఏవీ చూపు."

"హా....."

"........."

"రైటో! అతనికి దుస్తులనుచ్చి, స్టేషనుకు తీసుకు పొండి."

"నా ప్రార్థన వినండి.. కొంచెం! నేను జూటు మిల్సులోని నేర్పరిపనివాణ్ణి. నేర్పరి పనివాండ్రను యుద్ధములోనికి లాగి కొనిపోవుటం అన్యాయం! పయిగా నా ఆత్మకు వ్యతిరేకంగా నేను: తుపాకీపట్టలేను...పట్టబోను, ఇందులో పొరబాటు జర్గి వుంటుందని నేను తిరిగి చెబుతున్నా."

"ఆహా! ఇంక అనవసరముగా మాటాడకు. పొరబాటు ఏమయినా వుంటే తర్వాత సర్దుకుందాం ఇక నకు నేనేమీ వినవిక. అయితే యుద్ధములో చేరడం నీ కెందుకిష్టము కాదు.?"

"పోదర మానవులను చంపే జాలి, గుండెలు నాకు లేకపోవడమే ముఖ్యకారణము. నేను హింసని చూడలేను...చేయలేను."

"హ హ్హ.. హ్హ! మరో కారణం వెతుకు అహింసావాదివా నీవు...అ హ్హ హ్హ!"

నాలుగు వందల ఇనుప మడమల బూట్లు ఏకగ్రీవముగా ఏదో సందేశాన్నిస్తూ.. స్టేషను వైపు పోతున్నాయి. వకే వక తప్పటడుగులు పడే బూట్లను మిగతా బూట్లు నిందిస్తూ...ముందుకు పరుగులెత్తుతున్నాయ్.

నెత్తిమీద. టోపీ, ఖాకీదుస్తులు...అతను... నడుము మీదిభాగాన్ని రైలుబల్ల పయిన దించుకొని ...చిన్న నిట్టూర్పును వదలి. ఆప్యాయంగా చుట్టూ చూడసాగేడు తన గ్రామము వయిపు.

స్టేషన్‌లోని మ్రోగిన గంటను విని అతని కండ్లు చెమ్మగిలినాయి. తిరిగి తను తనస్వగృహానికీ, స్వగ్రామానికీ వచ్చి...తన ప్రియమిత్రులనీ, తన ప్రజలనీ ...చూడగలుగుతాడా? గ్రామస్థులకి తనంటే ఎంత ప్రేమ? కాని యిందాక...తనని సిపాయిలు అవమానిస్తూంటే... వకర్దూ తనని—అయినా గ్రామస్థులకి తనంటే ఎంత దయ! ఎంత ప్రేమ!

బండికదలినది. అతను కండ్లనుండి కారేకన్నీరును తుడుచుకుంటూండగా, వక యువకుడు ప్లాటుఫారము మీదనుంచి...ముందుకు వంగి "నీవేనా అహింసావాదివి? పిరికి పందవ్! నీముఖం నాకు చూపబోకు—యిక" అంటూ చెట్టున ముఖాన—.

అహింసా వాది ముఖము. వుమ్మితో నిండింది.

దూరమయ్యే రైలునుండి, చప్పట్లు, కేకలు, యీలలు! స్టేషను వయిపు ఇనుప మడమలు...ఇంకా ధ్వనిస్తూ, ప్రతిధ్వనిస్తూనే... .... వుంటూంటాయ్.

For
HALFTONE
&
COLOUR BLOCKS
Consult or Phone to
No. 4133
RAVI PROCESS
156 Broadway,
G. T. MADRAS.